క్లుప్తంగా

సామాజిక భవనం పూర్తి చేయాలని వినతి



ఎంపీ మాధవికి వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ ముసిలినాయుడు, ఎంపీటీసీ అప్పారావు

కొయ్యూరు: కొండగోకిరి పంచాయతీ పాతపాడిలో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ భవనాన్ని పూర్తి చేయాలని కోరుతూ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు సోమవారం అరకు ఎంపీ మాధవికి వినతి పత్రం ఇచ్చారు. పాతపాడిలో కమ్యూనిటీ భవనం లేక పడుతున్న ఇబ్బందులను ఆయన ఎంపీ దృష్టిలో ఉంచారు. దీనిపై ఎంపీ మాధవి సానుకూలంగా స్పందించినట్టు ఆయన తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో డౌనూరు ఎంపీటీసీ సభ్యుడు బి.అప్పారావు తదితరులున్నారు.

నేడు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

అడ్డతీగల: మండలంలోని డి.రామవరం సచివాలయం పరిధిలో అనుకులపాలెం, వీరంపాలెం, డి.కొత్తూరు గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎల్లవరంలోని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఈ కార్యక్రమంలో పాల్గొని ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం డి.రామవరంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



పనులు ప్రారంభించిన సర్పంచ్ వీరేంద్ర ప్రసాద్

గూడెంకొత్తవీధి: లక్కవరపుపేట పంచాయతీ తూరుమామిడిలో రూ.20 లక్షలతో చేపడుతున్న జల్‌జీవన్ మిషన్ పనులను సర్పంచ్ వీరేంద్ర ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామానికి తాగునీటి పైపులైన్‌ల ద్వారా నీరు అందిస్తోందన్నారు.పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

150 మందికి వైద్య సేవలు



గాంధీనగరంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

జి.మాడుగుల: మండలంలో గాంధీనగరం గ్రామంలో మలంకర కేథోలిక్ మిషన్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో పాడేరు సెయింట్ ఆన్స్ మెడికల్ సెంటర్ బృందం సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. గాంధీనగరం, పెదలంక, రచ్చపల్లి, మధురమామిడి, చుట్టుమెట్ట గ్రామాలకు చెందిన 150 మందికి వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పాస్టర్ వి.మల్లేశ్వరరావు, ఫాదర్ స్టీఫెన్ పాల్గొన్నారు.

చింతపల్లిలో బిర్సాముండా జయంతి వేడుకలు రేపు



ప్రచారం చేస్తున్న దండకారుణ్య విమోచన సమితి సభ్యులు

చింతపల్లిరూరల్: స్థానిక మార్కెట్ యార్డులో బిర్సాముండా 149 జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్టు దండకారుణ్య విమోచన సమితి(డీఎల్‌ఓ) జిల్లా అధ్యక్షుడు కాంతారావు సోమవారం తెలిపారు. ఏటా హుకుంపేటలోని దండకారుణ్య విమోచన సమితి ముఖ్య కేంద్రంలో వేడుకలు జరిగేవని, ఈ సంవత్సరం చింతపల్లిలో నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఎల్‌ఓ వ్యవస్థాపకులు చెండా ఏలియా, లలిత్‌నారాయణ హాజరుకానున్నట్టు తెలిపారు. ప్రతీ ఒక్కరు హాజరుకావాలని కోరారు. జాన్, శోభన్, కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.



దీపావళి వేడుకలలో పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, డాక్టర్ నరసింగరావు, కుటుంబ సభ్యులు



ఎటపాకలో దీపావళి టపాసులు కాల్చుతున్న కుటుంబం



జి.మాడుగులలో దీపావళి జరుపుకొంటున్న సీఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది

మన్యంలో దీపావళి సంబరాలు

- భక్తిశ్రద్ధలతో దీపారాధన
- చిన్నారుల, యువత సందడి

సాక్షి, పాడేరు: నరక చతుర్దశి దీపావళి పండుగను ఆదివారం వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. ఇంటి ముందు వాకిళ్ల ముగ్గులు, దీపాలతో అందంగా అలంకరించారు. ఇళ్ల గుమ్మాలకు రంగవల్లులు అద్దారు. ఇంటిల్లిపాది తలంటి స్నానం చేసి కొత్త దుస్తులు ధరించారు. గృహాల్లో దీపారాధన చేశారు. లక్ష్మీదేవి పూజలు ఘనంగా జరుపుకున్నారు. రకరకాల తీపి వస్తువులు వండి నివేదించారు. పూజ వద్ద ఆభరణాలు ఉంచి పూజలు చేశారు. చెరుకు గడలకు అమర్చిన దీపాల జువ్వలు కొట్టారు. కుటుంబ సభ్యులందరు కలసి బాణాసంచా కాల్చి సందడి చేశారు.కుటుంబ సభ్యులు, బంధువులతో ఆనందంతో గడిపారు. వీధులన్నీ రంగు రంగుల వెలుగులతో,బాంబుల మోతతో దద్దరిల్లాయి. జిల్లా వ్యాప్తంగా దీపావళి పండగతో ఆధ్మాత్మిక వాతావరణం నెలకొంది.



డుంబ్రిగులో దీపావళి పండుగను నిర్వహిస్తున్న కుటుంబం



గరుడాపల్లిలో సందడి చేస్తున్న యువత

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మకు లోకకళ్యాణార్థం ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యం ప్రత్యేక పూజలు జరిపారు.కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌లు కూడా తమ నివాసాల్లో దీపావళిని జరుపుకున్నారు. ఏజెన్సీలోని గిరిజనులంతా తమ ఆచార సంప్రదాయాల్లో దీపావళి పండగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు.గ్రామచావిడిలో శంకులమ్మ రాతి విగ్రహాల వద్ద గ్రామపెద్దలు దీపారాధన చేవారు.పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావులు తలారిసింగిలోని తమ నివాస గృహం వద్ద గిరిజన సంప్రదాయంలో దీపారాధన చేశారు. బాణాసంచా వెలిగించి సందడి చేశారు. దీపావళిని ఘనంగా జరుపుకున్నారు.అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తన కుటుంబ సభ్యులతో పాడేరులోనే దీపావళిని జరిపారు.రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి దీపారాధన చేశారు.



ముంచంగిపుట్టులోని టపాసులు కాలుస్తున్న దృశ్యం

బాణాసంచా హోరు

జిల్లా వ్యాప్తంగా ఈఏడాది కూడా ప్రజలు తమ స్తోమతకు తగ్గట్టుగానే దీపావళి బాణాసంచాను భారీగా కొనుగోలు చేశారు.జిల్లాలో 90 బాణాసంచా దుకాణాలకు లైసెన్స్‌లు ఇవ్వగా సుమారు రూ.4కోట్ల వరకు వ్యాపారం జరిగినట్టు తెలుస్తుంది. బాణసంచా వెలుగులు, బాంబుల మోతతో జిల్లాలోని అన్ని గ్రామాలు హోరెత్తాయి. దీపావళితో జిల్లాలో ఎక్కడా ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరుకుండా ప్రశాంతంగా జరగడంతో రెవెన్యూ,పోలీసు,అగ్నిమాపకశాఖల అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కాకరపూవొత్తి కాలుస్తున్న చిన్నారి



రాజవొమ్మంగిలో దీపావళి పండుగ జరుపుకొంటున్న కుటుంబం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

మారేడుమిల్లి : మండలంలోని కుడూరు గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకును జీపు ఢీకొట్టిన సంఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వై.రామవరం మండలం గుర్తేడు గ్రామానికి చెందిన సుంకరి ముకేష్, గొర్లె నాని, చందన అనే ముగ్గురు బైకుపై చింతూరు నుంచి గుర్తేడు వెళ్తుండగా మార్గమధ్యలో మారేడుమిల్లి దాడిన తరువాత కుడూరు గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న జీపు బైకును ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. బైకుపై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానిక పీహెచ్‌సీకి తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్య సేవలు కోసం రంపచోడవరం తరలించారు. ఇందులో సుంకరు ముకేష్‌ను రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు.

వచ్చే నెలలో గంగదేముడు పండగ

దుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ కేంద్రంలో డిశంబర్ 17, 18 తేదీల్లో పండుగను నిర్వహించాలని కోరుత పంచాయతీలో 33 గ్రామాల గిరిజనులతో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్విహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గంగమ్మతల్లి పండుగను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. సుబ్బారావు, శ్రీరాములు , ధనివరావు, స్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటరావు

నేడు గ్రామ సచివాలయ భవనాలు ప్రారంభం

జి.మాడుగుల: మండలంలో కోరాపల్లి, జి.మాడుగుల–2 (సాడేక్‌కాలనీ) సచివాలయాల భవనాలను మంగళవారం ఉదయం 10 గంటలకు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్.మత్స్యకొండంనాయుడు, ఉవ్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర తెలిపారు. వారు మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు జి.మాడుగుల–2 సచివాలయాన్ని, మధ్యాహ్నం12 గంటలకు కోరాపల్లిలో సచివాలయ భవనాన్ని ఆమె ప్రారంభిస్తారని, 3 గంటలకు ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహిస్తారని పేర్కొన్నారు. మండలంలో గల జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెసీఎస్ కన్వీనర్, నాయకులు, గృహసారధులు, వలంటీర్లు, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు



సున్నంపాడు గ్రామంలో పర్యటిస్తున్న పార్టీ కన్వీనర్ సత్తి సత్యనారాయణరెడ్డి, నేతలు



రాజవొమ్మంగిలో బుక్‌లెట్‌లు పంపిణీ చేస్తున్న నాయకులు

మారేడుమిల్లి: ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని సున్నంపాడు గ్రామంలో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం పర్యటించారు. గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కన్వీనర్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా సుపరిపాలన అందిస్తున్నారన్నారు.రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి మరలా జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. ఎంపీపీ సార్ల లలిత కుమారి, సున్నంపాడు ఎంపీటీసీ అనిల్, సర్పంచ్ చిన్న లచ్చి రెడ్డి, జెసీఎస్ మండల కన్వీనర్ గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ), యూత్ నాయకుడు దూడ స్మిత్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా బీసీల వీధిలో నాయకులు పర్యటించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. పార్టీ జిల్లా మహిళా నాయకురాలు చీడిపల్లి శాంతకుమారి, లక్ష్మణరావు, పందూరి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు న్యాయం చేయాలి

అరకులోయ రూరల్: మండలంలో సుంకరమెట్ట పంచాయతీ బంగ్లవలస గ్రామంలో ఇటీవల ఒడిశాకు చెందిన ఓ వ్యక్తికి చెందిన భూమికి సంబంధించిన విషయంపై ఆదివాసీ గిరిజనులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ నూకదొర సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గెమ్మెలి బాబూరావు ఆందోళనలో సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశా నుంచి వలస వచ్చిన గిరిజననేతరుడు గ్రామ కంఠం భూమికి సంబంధించి స్థానిక గిరిజనులపై అక్రమ కేసులు పెటడం అంతర్యం ఏమిటన్నారు. ఆదివాసీ గిరిజనులపై పెట్టిన కేసులు వెనక్కి తీసుకోవాలన్నారు. ఆదివాసీలకు న్యాయం చేయాలన్నారు. గిరిజనేతరుడికి గిరిజనుడిగా చలామణి చేస్తూ ధ్రువపత్రాలు చేశారని, దీనిపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఉద్యమం తీవ్రం చేస్తామన్నారు. నాయకులు చిట్టిబాబు, గోపి, బాలకృష్ణ, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలి

అనంతగిరి: మండలంలోని ఎస్.ఆర్.పురం, రొంపల్లి రెండు పంచాయతీల్లో బూరుగు, చినకోనెల, డెంజివలస, చిముడువలస, బోంగిజ, రాయిపాడు గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరారు. విద్యుత్ సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నామని, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

వై.రామవరం: మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో మంగళవారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు లైబ్రేరియన్ జర్త సత్యవతి చెప్పారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, డ్రగ్స్‌పై అవగాహన, 16న గ్రంథాలయ ఉద్యమకర్తలకు నివాళి, 17న రచయితల సందేశాలు, కవి సమ్మేళనలు, అవగాహన సదస్సులు, 18న విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, క్రీడలు తదితర పోటీలు, 19న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలతో వివిధ కార్యక్రమాలు, దిశ చట్టం, మహిళా సాధికారతపై అవగాహన 20వ తేదీన డిజిటల్ గ్రంథాలయాలు, చదువు అంటే మాకిష్టంపై పాఠకులు, గ్రామస్తులు, విద్యార్థులకు అవగాహన, గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు, పలు పోటీల్లో విజేతలకు బహుమతి ప్రధానం కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు సత్యవతి పేర్కొన్నారు. ప్రముఖులు అంతా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

గంగవరం : మండల శాఖా గ్రంథాలయంలో మంగళవారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు లైబ్రేరియన్ గంగాభవానీ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా పెట్రోల్ బంక్



కొయ్యూరు: మండలంలోని ఎం.మాకవరం పంచాయతీ పిట్టచలంలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తున్న హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఆరు సంవత్సరాల కిందట జీసీసీ, ఐటీడీఏ ఆధ్వర్యంలో కాకరపాడు వద్ద పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేశారు. ఈ బంక్ విజయవంతంగా కొనసాగుతోంది. పిట్టచలం గ్రామంలో బంకు ఏర్పాటు కు ఐటీడీఏ చర్యలు తీసుకొంది. ప్రస్తుతం పను లన్నీ పూర్తయ్యాయి. త్వరలో బంకు ప్రారంభం కానున్నట్టు పలువురు చెబుతున్నారు. జాతీయ రహదారిలో ప్రయాణించే వారికి ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. ఇక్కడ పనిచేసేందుకు అవసరమైన సిబ్బంది నియామకాన్ని ఐటీడీఏ పీవో త్వరలో చేపట్టనున్నారు.

యూటీఎఫ్ జిల్లా కోశాధికారిగా కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నిక



కృష్ణ

గంగవరం: అల్లూరి జిల్లా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కోశాధికారిగా కె.కృష్ణ మాష్టారు మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. దీనిపై యూటీఎఫ్ మండల శాఖ హర్షం వ్యక్తం చేసింది. మండలశాఖ గౌరవ అధ్యక్షుడు కొమరం రఘుబాబు, అధ్యక్షుడు రాంబాబు దొర, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు , మండలశాఖ నాయకులు అభినందనలు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శిగా, వైఎస్సార్ జిల్లా కోశాధికారిగా పని చేస్తూ యూటీఎఫ్ కార్యకలాపాలతో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృష్ణ మాష్టారు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు స్వీకరించాలని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, ఎంఈవో–1 మల్లేశ్వరరావు, ఆర్‌ఐ జిలానీ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

సాయిబాబా మందిర వార్షికోత్సవానికి ఏర్పాట్లు

రాజవొమ్మంగి: స్థానిక షిర్డీ సాయిబాబా మందిర 22వ వార్షికోత్సవానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా ఈనెల 15న మధ్యాహ్నం బాబావారి పల్లకీ సేవ (ఊరేగింపు), 16న మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ సమారాధన, 17న బాబా వారికి ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొవాలని కోరారు.



సాయిబాబా మందిరం



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

క్రికెట్ టోర్నీ విజేత కుమ్మూరు

చింతూరు: మండలంలోని బుర్కనకోటలో సోమవారం నిర్వహించిన యూత్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్లో కుమ్మూరు జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు చిడుమూరు సర్పంచ్ కాక అరుణకుమారి నగదు బహుమతితో పాటు ట్రోఫీని అందజేశారు. ఎంపీటీసీలు ముర్రం లక్ష్మి, వేక రాజ్‌కుమార్, కమ్మల జయరాజు, వెంకయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టూరిజం కార్మికుల సమ్మె

అనంతగిరి: టూరిజం కార్మికులు సమ్మె కొనసాతుంది. ఈ నెల 11 నుంచి కార్మికులు సమ్మెబాటపట్టారు. బొర్రా గుహలు, హైడ, అనంతగిరి హరిత వద్ద కార్మికులు యూటీఎఫ్, స్థానిక ప్రజాప్రతినిధులు మద్దతు తెలిపారు. బొర్రా గుహలు మూసివేయడంతో పర్యాటకులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

చకచకా 'హాయి'వే పనులు

మండలంలో సుమారు 30 కిలోమీటర్ల మేరకు జాతీయ రహదారి 516/ఈ నిర్మాణం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గిరిజనులు ఏనాడూ ఊహించని విధంగా కొండదారుల్లో హాయిగా వెడలైన రహదారుల్లో ప్రయాణించే సౌకర్యం త్వరలో అందుబాటులో రానుంది. ఈ రహదారి పూర్తయితే సురక్షితంగా అతి తక్కువ కాలంలో ప్రయాణించే సదుపాయం కలగనుంది. మలుపు దారుల ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. విశాలమైన రహదారుల ప్రయాణానికి పనులు ప్రారంభమయ్యాయి.



చింతాలమ్మ ఘాట్ రోడ్డు

- శరవేగంగా చింతాలమ్మ ఘాట్ రోడ్డు
- వెడల్పు కానున్న ఇరుకైన మలుపులు

కొయ్యూరు: కృష్ణదేవిపేట–కొయ్యూరు మార్గంలో రెండు కిలోమీటర్ల పొడవైన చింతాలమ్మ ఘాట్ ఉంది. ఈ దారిలో ఐదు ఇరుకైన మలుపులున్నాయి.ఈ ప్రాంతం మీదుగా జాతీయ రహదారి నిర్మిస్తుండడంతో ప్రస్తుతం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఘాట్‌రోడ్డు వెడల్పును పెంచే పనులు చేపడుతున్నారు. ప్రమాదకర మలుపులు లేకుండా రోడ్డు విస్తరణకు అధికారులు ప్లానింగ్ చేశారు. మండలంలోని ఎన్‌హెచ్–516/ఈ రానుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ రహదారి కొయ్యూరు మండలం రంపుల, పెదవలస మీదుగా చింతపల్లి, అటు నుంచి లంబసింగి, అక్కడి నుంచి జి.మాడుగుల మీదుగా పాడేరు వరకు నిర్మించనున్నారు. కొయ్యూరు మండల వాసులు పాడేరు అతి తక్కువ సమయంలో జాతీయ రహదారి మీదుగా చేరే అవకాశం రానుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా ఇరుకైన రహదారులను వెడల్పు చేయనున్నారు. వాహనాలు రెండు వైపులా రాకపోకలు సాగించే విధంగా ఎక్కువ వెడల్పు చేయనున్నారు. దీంతో ప్రమాదాలు తగ్గే వీలుంది. కొయ్యూరు నుంచి వెళ్లేటప్పుడు, అటు నుంచి వచ్చేటప్పుడు ఉన్న ఇరుకైన మలుపులు వాహనాలను ఇబ్బందులకు గురి చేస్తుంది.

చురుగ్గా పనులు

జాతీయ రహదారి నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్ సమస్య లేకుండా చేస్తాం. వాహనలు సులువుగా వెళ్తాయి. మలపులను బాగా వెడల్పు చేస్తాం. ప్రయాణానికి ఘాట్‌రోడ్డు అనువుగా ఉంటుంది. ప్రయాణం సజావుగా సాగుతుంది. దీనికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.


– భరత్, జాతీయ రహదారి, ఏఈ

ప్రయాణం బాగుంటుంది

చింతాలమ్మఘాట్‌లో ఇరుకై న మలుపులను వెడల్పు చేయడం మూలంగా ప్రయాణం బాగుంటుంది. వెడల్పు అయితే ప్రమాదాలు కూడా తగ్గుతాయి.ఇ ప్పటికే తుప్పలు తొలగించి వెడల్పు చేయడంతో ప్రయాణం బాగుంది. మొత్తం రోడ్డు వేస్తే ప్రయాణం మరింత సులభతరం అవుతుంది.

– నాగేశ్వరరావు, సింగవరం

రోగులకు రొట్టెలు పంపిణీ



రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు, సింహాద్రి తదితరులు

అరకులోయటౌన్: అంతర్జాతీయ దయా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహానేత వైఎస్సార్, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభిమానులు సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఫెడరేషన్ కార్యదర్శి కోడా సింహాద్రి మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణం కోసం ప్రతీ ఒక్కరూ సేవా దృక్పదం అలవర్చుకొవాలన్నారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, గిరిజాగృతి సంస్థ అధ్యక్షుడు మోరి సింహాచలం, ఆదివాసీ జెఏసీ మండల కన్వీనర్ ఎస్.గోపాల్, కో–కన్వీనర్ కె.రామచందర్, ఎస్ఫీ అధ్యక్షుడు సీహెచ్.మోహన్, యూత్ కమిటీ నాయకులు రవికాంత్ నాయుడు, రవి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.